# కొత్తకోణం

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

స్నానానికి వెళ్ళబోతూ సుభద్రమ్మ బట్టల బీరువా ముందు నించుని, ఆ రోజు కార్యక్రమానికి ఏం చీర కట్టుకెళ్ళాలా అని ఆలోచిస్తోంది. ఎటూ టి.వి. ఛానెల్స్ వాళ్ళు వస్తారు. టి.వి. ఛానల్స్ రాక మునుపు ఇలా చీరల విషయం సమస్యగా వుండేది కాదు. కాని పబ్లిక్ ఫిగరైన తననే కాక ఇప్పుడు టి.వి. ఛానెళ్ళలో తను కట్టే చీరలు కూడా గమనించే మహిళా ప్రేక్షకులుంటారు. ఓసారి కట్టింది కట్టకపోతే 'ఈవిడకి ఎన్ని చీరలో' అనుకుంటారు.

తనని అంతా మెచ్చుకోవాలి, తను తోటివారికన్నా ఓ మెట్టు పైనున్నదనిపించుకోవాలి. అన్నది సూక్ష్మంగా సుభద్రమ్మ జీవిత ధ్యేయం.

ఈలోగా ఎస్.ఎస్.ఎస్. వాళ్ళు చెప్పిన టైంకన్నా అరగంట ముందే వచ్చేసారు. సమాజ సంరక్షణ సమితికి ఎస్.ఎస్.ఎస్. అబ్రివేషన్.

దాంతో ఆవిడ గబగబ బాత్‌రూం లోకి వెళ్ళి పంపుతిప్పింది. హతోస్మి. చన్నీళ్ళే. తప్ప గీజర్ ఆన్‌చేసినా వేణ్ణీళ్ళు రాలేదు.

ఇదేమిటి? కరెంట్ కట్ లేని టైంలో కూడా కరెంట్ తీసేస్తున్నారు. తనా కాలనీలో వుందని కూడా ఆ ఇ.ఇ.కి తెలీదా? ఆ విషయం మనసులో నోట్ చేసుకుని గేస్ స్టౌమీద నీళ్ళు పెట్టుకుందామని వంట గదిలోకి వెళ్ళింది.

మళ్ళీ హతోస్మి.

గేస్ స్టౌ రెండు నిముషాలు వెలిగి ఠక్కున ఆరింది.

"ఏమండీ గేస్ వాసనేస్తోంది, అయిపోతోంది. గేస్ వాళ్ళకి ఫోన్ చేయమని చెప్పా. ఏం చేశారు?"

పాత 'భారతి' సంచిక చదువుతున్న భర్తని నిలదీసింది సుభద్రమ్మ.

"మరిచానే"

"అఘోరించలేక పోయారు? ఆ ఎలక్ట్రిక్ ఆఫీస్‌కి వెళ్ళి 'ఏంటలా ఇష్టం వచ్చినట్టు కరెంట్ తీసేస్తున్నారు' అని అరచి రండి. మీరు నా భర్తని చెప్పండి"

"అది నువ్వెళ్ళి చెప్తేనే బావుంటుందేమోనే"

"ఛ.ఛ. మీకేం చేతకాదు. మీవల్ల ఏం పనీ కాదు"

నాలుగు చెంబులు చన్నీళ్ళు కుమ్మరించుకుని కల్నేత పట్టుచీర కట్టుకుని హేండ్ బేగ్ అందుకుంది. షోలాపూర్ చెప్పలు తొడుక్కుని తన ఈడు ఆడవాళ్ళకి చెప్పింది.

"పదండి. కాఫీ ఇవ్వలేదనుకోకండి. గేస్ స్టౌ సిలెండర్ నిండుకుంది" ముందు రోజు చెప్పడంతో ఆటోలవాళ్ళు నలుగురు వచ్చి సిద్ధంగా వున్నారు. ఎప్పుడైనా ఆటోవాళ్ళు తమ సమస్యల మీద స్ట్రయిక్ చేస్తే వాళ్ళ తరపున సుభద్రమ్మ బహిరంగ సభలో మాట్లాడుతూంటుంది. అంచేత ఈ సౌకర్యం ఆటో సంఘం వాళ్ళు ఆవిడకి అందిస్తుంటారు.

ఆటోలు సరాసరి సెక్రటేరియెట్‌కి చేరుకున్నాయి. మరికొందరా

డవాళ్ళు టెంట్ దగ్గర సుభద్రమ్మ అండ్ పార్టీకి స్వాగతం చెప్పారు.


– రమ్మ అంటే పొమ్మ అను

– బస్కీలు ఆరోగ్యం విస్కీలు అనారోగ్యం

– మద్యపానం ఈ రాష్ట్రంలో అసాధ్యం

లాంటి నినాదాలు రాసిన బట్టలు టెంట్‌కి కట్టి వున్నాయి.

సుభద్రమ్మ టెంట్‌లో కూర్చుంది. మద్య నిషేధాన్ని ఎత్తివేసే ప్రభుత్వ యోచనకి వ్యతిరేకంగా చేసే ఆందోళన అది.



బట్టల మీద రాసిన నినాదాలు అరిచారు. తొమ్మిదిన్నర పదిన్నర యింది. సుభద్రమ్మకి కొద్దిగా తలనొప్పిగా వుంది.

పత్రికా విలేకరులు వచ్చారని నినాదాలు ఇంకాస్త గట్టిగా అరిచి అరిపించింది సుభద్రమ్మ. వాళ్ళు వేసిన

ప్రశ్నలకి సమాధానాలు చెప్పింది.

"ముప్పై రెండేళ్ళ క్రితం అరవై ఎనిమిదిలో ప్రభుత్వం మద్య నిషేధాన్ని ఆంధ్రా అంతటా ఎత్తేసింది. అప్పటి నించి యువకులు తాగుతున్నారు. మరి ఒక్కసారిగా ఈ అలవాటుని మార్చేసుకోమంటే ఎలా కుదురుతుంది?"

"మానాలంటే ఆనారోగ్యం అని తెలిసి అసలెందుకు తాగాలి?"

"అది తాగిన వాళ్ళకి అనారోగ్యాన్ని కలిగిస్తుంది. ఎవరి బాధ్యతలు వాళ్ళకి తెలుసుగా?"

"మానాలంతే. వృధా ఖర్చు"

"సంపాదనని బట్టి ఎవరి బడ్జెట్ వాళ్ళు కేటాయించుకోగలరుగా"

"నే చెప్తున్నాగా. మానాలంతే" హూంకరించింది.

పన్నెండున్నరకి అడిగింది సుభద్రమ్మ.

"టి.వి. వాళ్ళింకా రాలేదేమిటి చెప్మా?" రేపు ప్రసారం కావాలంటే ఈవెనింగ్ ఫోర్‌కి టేప్స్ మద్రాస్ వెళ్ళాలి. ఎప్పుడొస్తారు, ఎప్పుడు షూట్ చేస్తారూ, ఎప్పుడు ఎడిట్ చేస్తారు?"

"ఏమో మరి."

"మళ్ళీ ఫోన్ చేయించు"

"అలాగేనండి"

"అరవండంతా. బలం కోసం బస్కీలు"

"బలం కోసం బస్కీలు"

"విలన్ల కోసం విస్కీలు"

"విలన్ల కోసం విస్కీలు"

"రమ్ము అంటే"

"పొమ్ము అంటాం"

హైకమాండర్ సుభద్రమ్మ, తన తర్వాతి స్థానంలోని సుబ్బలక్ష్మమ్మని అడిగింది.

"కాఫీ ఎక్కడైనా దొరుకుతుందంటావా?"

"మనం టెంట్‌లోంచి బయటకెలా వెళ్తాం?"

"పోనీ తెప్పించే ఏర్పాటు చూడు"

"అది కాఫీ కాదని, కల్లని ప్రజలు అనుకోవచ్చు"




"సర్లే, సర్లే"

రెండు ముప్పావుకి ఆవిడ కోరిక తీరింది. కెమెరాలట్టుకుని వచ్చారు ఛానెలోళ్ళు. అందరి చేతుల్లో కొన్ని క్షణాలు చిన్న అద్దాలు, దువ్వెనలు పౌడర్ డబ్బాలు ప్రత్యక్షం అయి మళ్ళీ మాయం అయాయి.

సాయంత్రం ఆరుంపావుకి రాష్ట్రంలో 'మద్య నిషేధం ఎత్తివేత యోచన'కి వాళ్ళ వ్యతిరేక ప్రదర్శన ముగిసింది.

టెంట్లు వాళ్ళొచ్చారు, వాటిని పీక్కెళ్ళడానికి. ఆటోలవాళ్ళు వచ్చారు. ఇళ్ళ దగ్గర హై కమాండర్స్‌ని దించడానికి.

ప్రదర్శన బాగా జరిగిందని అంతా అనుకున్నారు. సుభద్రమ్మ ఆటో ఎక్కగానే అడిగాడు డ్రయివర్.

"అమ్మగారూ, ఇంటికే కదండీ?"

"ఇంటికేకాని ముందు ఓసారి ఆ ఎదురుగావున్న ఆదర్శనగర్‌కి పోనీ చెప్తా"

ఆటో ఆదర్శనగర్‌లో పార్క్ వెనక సందులోని ఓ మధ్యతరగతి ఇంటి ముందు ఆగింది.

"ఇప్పుడే వస్తానుండు" సుభద్రమ్మ ఆటో దిగి ఆదరాబాదరాగా లోపలికి పరిగెత్తింది.

"పాపం. బాత్‌రూం బాధితురాలు కాబోలు" అనుకున్నాడు ఆటోడ్రయివర్ ఆ పరుగుచూసి.

సుభద్రమ్మని చూసి ఆహ్వానించింది టి.వి. చూస్తున్న ఓ యువతి.

"రా పిన్నీ రా. ఏంటిలా ఉరుము లేని పిడుగులా ఊడిపడ్డావ్"

"నీకు తెలీదా? పొద్దుట్నించీ సెక్రటేరియట్ దగ్గర ఆందోళన చేసి వస్తున్నాను."

"దేనికి? విద్యార్థిని మొహం మీద ఏసిడ్ చల్లిన దానికి బాధ్యులైన వాళ్ళని శిక్షించాలనా లేక...?"

"మద్యపాన నిషేధం కంటిన్యూ చేయాలని. ముందు ఓ కప్పు కాఫీ కలిపి తీసుకు రామ్మా. పొద్దున నిద్ర లేచింది మొదలు ఒక్క చుక్క కూడా కాఫీ తాగలేదంటే నమ్ము"

"ఎందుకు తాగలేదు పిన్నీ?"

"ఇంట్లో గేస్ అయిపోయింది. సరాసరి ఉద్యమ టెంట్‌కి వెళ్ళాను. అక్కడ ఎవరిస్తారు? తల పగిలి పోతోందంటే నమ్ము"

"సారి పిన్నీ. కాఫీపొడి అయిపోయింది."

"అదేమిటి? ఇంట్లో కాఫీపొడి ఉంచుకోకుండా ఎలా కాపురం చేస్తున్నావే"

"ఆయనకి చెప్తా పిన్నీ. కానీ తెస్తేనా. ఉత్తి మతిమరుపు మనిషి"

"బానే వుంది చోద్యం. చూడవే. సీసాలో అడుగు బొడుగు ఏదైనా వుందేమో"

"నాకో విషయం ముందు చెప్ప పిన్నీ"

"ఏమిటి?"

"ఏమిటి?"

"ఎవరైనా కాఫీపొడిని నిషేధించాలని ఉద్యమం లేవదీస్తే? ఓట్ల కోసం నిజంగా రాజకీయ నాయకులు దాన్ని నిషేధిస్తే? అప్పుడు నీలాంటి వాళ్ళేం చేస్తారు?"

"అదేం మాటే!"

"అవును పిన్నీ. ముప్పై ఏళ్ళుగా మా ఆయనకి లిక్కర్ అలవాటు. నీలాంటి వాళ్ళు సమాజ సంక్షేమం చేస్తున్నామనుకుంటూ పెద్ద గొడవ లేవదీస్తే దాని రాజకీయ నాయకులు ఓట్లకి వాడుకుని ఇప్పుడు వాళ్ళే మద్యం స్మగ్లింగ్ ద్వారా లాభపడుతున్నారు. మధ్యలో చెడింది మా ఆయనలాంటివాళ్ళే. నూట ఎనభై రూపాయిలకి దొరికే సీసాని నాలుగు వందలు పెట్టి కొంటున్నారు"

"మరి మానచ్చుకదటే"

"ఆఫ్టరాల్ ఒకపూట కాఫీ మానలేని నువ్వు నెలలు కాదు సంవత్సరాలు తరబడి అంతా లిక్కర్ మానేయాలని ఎలా ఉద్యమం చేస్తున్నారు సుభద్రమ్మ పిన్నీ? నువ్వు రోజుకి నాలుగు కప్పుల కాఫీకి ఎలా బానిసవో అలా ప్రతి శనివారం రాత్రి ఆయన రెండు పెగ్గుల లిక్కర్‌కి బానిస. ఎవరి బలహీనతలు వాళ్ళవి. మన అలవాట్లు మానుకోలేని మనం ఇతరుల అలవాట్ల విషయంలో తలదూర్చడం తప్పుకాదా పిన్నీ?"

సుభద్రమ్మ ఆ యువతి మాటలకి అవాక్కయింది.

"ఉండు. ఇందాకే ఫిల్టర్ వేసాను. ఫస్ట్ డికాక్షన్‌తో మొదటి కప్పు కాఫీ నీకే తెస్తాను" నవ్వుతూ వంటగదిలోకి వెళ్ళిందా యువతి.

సుభద్రమ్మ తన జీవితంలో మొదటిసారి తల దించుకుంది. ఎందుకంటే ఆవిడకి తన గురించి ఓ కొత్త కోణంలోంచి ఆలోచించడం అంతదాకా ఎవరూ నేర్పించలేదు.